"మనిషిని మనిషిగా చూడడం సమాజానికి పాలకులకూ నేర్పించే పోరాటమే మానవ హక్కుల పోరాటం"

– కె. బాలగోపాల్

# మానవ హక్కుల వేదిక

## HUMAN RIGHTS FORUM (HRF)

**S. Jeevan Kumar**
President

**V.S. Krishna**
General Secretary

తేదీ : 28.9.2015

**శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గార్కి**

**ముఖ్యమంత్రి**

**తెలంగాణ రాష్ట్రం**

**విషయం : నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకు 'పోలీస్ ఎన్‌కౌంటర్లు' ఉండవని ప్రకటించమని అభ్యర్థన గురించి –**

గత మూడు దశాబ్దాలుగా పౌర, ప్రజాస్వామిక, మానవ హక్కుల ఉల్లంఘనపై ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల ఆంకాంక్షలను హక్కుల భాషలో వ్యక్తపరుస్తూ, ప్రజల హక్కులు భంగమైనప్పుడు ఆందోళన చేపట్టే స్వచ్ఛంద సంస్థగా **"మానవ హక్కుల వేదిక"** మీకు తెలిసిందే. ప్రజల ఆకాంక్షల్లోంచి ఉద్భవించిన హక్కుల అంశంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఆందోళనను మా సంస్థ బలపరిచింది. ప్రజల గొంతుతో గొంతు కలిపి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి హక్కుల భాషలో మాట్లాడింది. తెలంగాణ ఉద్యమంపై అమలైన నిర్బంధాన్ని ఎప్పటికప్పుడు నిజనిర్ధారణ చేసి ఎలుగెత్తి ఖండించింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో వెలువడ్డ ప్రజల ఆకాంక్షల్లో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల అణచివేత కోసం ప్రభుత్వాలు విధానపరంగా ఎంచుకునే పద్ధతుల వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులు, మానవ హక్కుల ఉల్లంఘన అంశం చాలా స్పష్టంగా వ్యక్తపరచబడింది. నిర్భయంగా, స్వేచ్ఛగా ప్రజలు తమ ప్రాథమిక, పౌర హక్కులను అనుభవించే పరిస్థితులు రాబోయే తెలంగాణా రాష్ట్రంలో నెలకొనాలని ప్రజలు గాఢంగా కాంక్షించారు. ఉద్యమ నాయకులు కూడా అటువంటి వాతావరణం ఏర్పడాలనే ఆవశ్యకతను నొక్కి చెప్పారు. భరోసా కూడా ఇస్తూ మాట్లాడారు.

కాని గతంలో ఉన్న పరిస్థితులే కొనసాగడం, నక్సలైట్లను అణచివేయడానికి ఎన్‌కౌంటర్ల పద్ధతి కొనసాగించడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది. **హక్కుల సంస్థ తరఫున ప్రజల ఆకాంక్షలను, మా అభిప్రాయాలను మీకు తెలిపి, ఈ విషయంపై నిర్దిష్టమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరుతూ ఈ లేఖ ప్రభుత్వానికి రాస్తున్నాము.**

గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 'ఎన్‌కౌంటర్' హత్యలు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో భాగంగా జరిగాయి. బ్రహ్మానందరెడ్డి, వెంగళరావుగార్లు ముఖ్యమంత్రులుగా ఉన్న పదకొండు సంవత్సరాలలో 350 మంది నక్సలైట్ పార్టీల కార్యకర్తలను ఎన్‌కౌంటర్లలో కాల్చివేసారు. 1979–1980లో ముఖ్యమంత్రిగా ఉన్న చెన్నారెడ్డిగారు ఎన్‌కౌంటర్లు వద్దని ఆదేశించడంతో ఎన్‌కౌంటర్ హత్యలు జరగలేదు. తర్వాత వచ్చిన అంజయ్య, భవనం వెంకట్రామ్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి గార్ల నాయకత్వంలో ఎన్‌కౌంటర్లు విధానపరంగా ఎక్కువ సంఖ్యలో జరగలేదు.

1984లో అధికారానికి వచ్చిన ఎన్టీరామారావు ఎన్‌కౌంటర్లు అసలే ఉండొద్దన్నాడు. ఆ సంవత్సరం అసలే జరగలేదు. తర్వాత సంవత్సరాలలో కొన్ని మాత్రమే జరిగాయి. 1989లో చెన్నారెడ్డి రెండవసారి అధికారంలోకి వచ్చినప్పుడు ఎన్‌కౌంటర్లు కూడదనటంతో, విధానపరంగా జరగలేదు. 1992 నుండి 1994 దాకా ముఖ్యమంత్రిగా ఉన్న నేదురుమల్లి జనార్ధన్ రెడ్డిగారు ఎన్‌కౌంటర్లు చేయడానికి పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో 340 మందిని కాల్చివేయడం జరిగింది. రెండు సంవత్సరాల కాంగ్రెసు పాలన, రెండవసారి తొమ్మిది నెలల ఎన్టీఆర్ పాలన తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన

P.T.O ...

చంద్రబాబు నాయుడు ఎన్‌కౌంటర్లను పూర్తిగా విధానపరంగా సమర్థించాడు. ఆయన పాలించిన 8 సంవత్సరాల 8 నెలల కాలంలో 1448 మంది ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి వేయబడ్డారు. ఈ హత్యాకాండ స్పష్టమైన ప్రభుత్వ ఆదేశాల మేరకే జరిగింది. **ఎన్‌కౌంటర్ హత్యలు చేసిన పోలీసు అధికార్లకు సీనియారిటీ ప్రక్కన పెట్టి ప్రమోషన్లు, డబ్బు రూపేణా పారితోషికం ప్రకటించి అమలు చేయడం కూడా జరిగింది.** ఈ ప్రభుత్వ వైఖరిని ఆసరాగా తీసుకుని పోలీసులు ప్రైవేటు గ్యాంగులకు ఆయుధాలిచ్చి హక్కుల సంఘం కార్యకర్తలను, ప్రజాసంఘాల కార్యకర్తలను, వామపక్ష సానుభూతిపరులపై దాడులకు పురమాయించి, హత్యలు కూడా చేయించారు. ఈ కార్యక్రమాలు పూర్తిగా చట్టవిరుద్ధంగా, పాలనా విధానంలో భాగంగా జరిగాయి. ప్రభుత్వం ఎన్‌కౌంటర్ హత్యలకు పారితోసికం ఇచ్చే విషయాన్ని ప్రశ్నిస్తూ నమోదైన ఒక కేసు సుప్రీంకోర్టులో పెండింగులో వున్న విషయం ఈ సందర్భంగా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాము.

ప్రజల హక్కుల ఆకాంక్షల నేపథ్యంలో ఏర్పడ్డ నూతన తెలంగాణ రాష్ట్రం దాన్ని పాలించే ప్రభుత్వం చట్టబద్ధ పాలనకు, జవాబుదారీతనానికి కట్టుబడి ఉండాలని హక్కుల సంఘంగా మేము కాంక్షిస్తున్నాం. చట్టబద్ధపాలన ద్వారా మాత్రమే. ప్రభుత్వానికి ప్రజలను పాలించే నైతిక సాధికారత లభిస్తుందని మా ప్రగాఢ విశ్వాసం.

గత ప్రభుత్వాలు నక్సలైట్ ఉద్యమాన్ని శాంతిభద్రతల సమస్యగానే పరిగణించి, ఉద్యమాన్ని అణచడానికి నక్సలైట్ కార్యకర్తలను, సానుభూతిపరులను భౌతికంగా నిర్మూలించడం పరిపాలనా విధానంగా అమలు పరచింది. గత 45 సంవత్సరాల నుండి హక్కుల ఉద్యమం నక్సలైట్ ఉద్యమాన్ని ఒక రాజకీయ ఉద్యమంగానే భావించి అదే విషయాన్ని ప్రభుత్వాలకు చెబుతూ వస్తున్నది. తమ లక్ష్య సాధన కోసం నక్సలైట్ పార్టీలు హింసకు పాల్పడినప్పటికీ కూడా దానిని ఒక రాజకీయ ఉద్యమంగానే చూడాలని హక్కుల సంఘాలు ప్రభుత్వాలకి స్పష్టం చేస్తూ వస్తున్నాయి. నక్సలైట్ హింసకు పాల్పడినప్పుడు చూస్తూ ఊరుకోవాలన్నది మా వైఖరి కాదు. పోలీసులు ఇటువంటి సందర్భాలలో విధిగా స్పందించాలి. అయితే పోలీసులు చేపట్టే చర్యలు ఏవైనా కూడా రాజ్యాంగం నిర్దేశించిన చట్టపరిధిలో ఉండాలి. ప్రజల హక్కులను గౌరవించేవిగా వుండాలి.

తెలంగాణ ఏర్పడ్డ తర్వాత జరిగిన మూడు ఎన్‌కౌంటర్ సంఘటనల్లో **8 మంది** (రంగారెడ్డి జిల్లాలో పారిపోతున్నాడన్న నెపంతో నేర చరిత్ర కలిగిన ఒక దొంగ, ఆలేరు ఎన్‌కౌంటర్‌లో గొలుసులతో వ్యాన్‌లోని సీట్లకు కట్టివేయబడ్డ 5గురు ముస్లిం యువకులు, వరంగల్ ఏటూరు నాగారం అడవుల్లో ఒక మావోయిస్టు మహిళా కార్యకర్త, ఒక యువకుడు) మరణించారు. పోలీసు లాకప్పుల్లో **6 (ఒక దళిత మహిళతోసహా)** అనుమానాస్పద మరణాలు జరిగాయి. ఈ ప్రభుత్వం కూడా **జాతీయ మానవ హక్కుల సంఘం, రాష్ట్ర హైకోర్టు** నిర్దేశించిన సూచనల మేరకు ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసులపై **సెక్షన్ 302** ప్రకారం కేసులు పెట్టి, **ఒక స్వతంత్రమైన నేర పరిశోధన విభాగం** చేత విచారణ కొనసాగించడం లేదు.

కొత్త రాష్ట్రంలో నక్సలైట్లను అణచివేసే విషయంలో పాత విధానాలే కొనసాగించడం పట్ల హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వం చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉండాలని పౌర, మానవ హక్కులకు భరోసా కల్పించాలని మేం కోరుకుంటున్నాము.

**పైన వివరించిన నేపథ్యం వెలుగులో "ఎన్‌కౌంటర్ హత్యల ప్రక్రియ" తెలంగాణ రాష్ట్రంలో ఉండదనే పాలనా పరమైన విధానాన్ని నిర్దిష్టంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని మానవ హక్కుల వేదిక (హెచ్.ఆర్.ఎఫ్) కోరుతున్నది.**

గౌరవాలతో ....

**(వి. ఎస్. కృష్ణ)**
ప్రధాన కార్యదర్శి

**(యస్. జీవన్‌కుమార్)**
అధ్యక్షులు

**President :** 3-12-117/A2/B, P.S. Colony, Ramanthapur Hyderabad - 500 013. Ph.No. 040-27039519, Mobile : 9848986286
**General Secretary :** 54-11-159/2, Gazetted Officer's Colony, Vishakhapatnam - 530 022. Ph. No. 0891-2543817, Mobile : 9440411899